# యూాన్,

# పచ్చ కంకణం






నా పేరు యూన్. నేను కొరియా నుంచి వచ్చాను. ఆ దేశం ఇక్కడి నుంచి చాలా దూరం.


ఆమెరికాకి వచ్చిన కొన్ని రోజులకే నా పుట్టిన రోజు వచ్చింది. ఆ రోజు నాకు బహుమతిగా తాడాట ఆడుకునే తాడు కావాలని కోరుకున్నాను. మా బడిలోని అమ్మాయిలు ఆ తాడుతో ఆడుతూ, గెంతుతూ ఎంతో సంతోషంగా ఉండటం నేను చాలాసార్లు చూశాను. నాకు కూడా వాళ్ల తోపాటు గెంతుతూ, పాడాలని ఉండేది. కానీ, నేను బడిలో కొత్తగా చేరాను కాబట్టి తమతో ఆడటానికి ఎవరూ పిలిచేవాళ్లు కాదు.



“యూన్, ఇటు రా. నీ పుట్టిన రోజుకి నా దగ్గర ఒక బహుమతి ఉంది!” అంటూ అమ్మ నన్ను పిలిచింది. నేను తప్పట్లు కొడుతూ అమ్మ దగ్గరకి పరిగెత్తాను. ఒక అందమైన కాగితం చుట్టి ఉన్న ఒక వస్తువుని అమ్మ నాకు ఇచ్చింది.

“పుట్టిన రోజు శుభాకాంక్షలు!” అమ్మ చెప్పింది. తాడు అలా ఉండదే అనుకున్నాను. నా నిరాశను దాచుకోటానికి ప్రయత్నిస్తూ అమ్మకి ధన్యవాదాలు చెప్పాను. నాకు ఇచ్చిన బహుమతిని తెరుస్తుంటే అమ్మ కుతూహలంగా చూస్తోంది.







అది కొరియా భాషలోని పుస్తకం. ఆ కథ నాకు తెలుసు. అందులో ఒక అమ్మాయిని ఒక పులి మోసం చేస్తుంది. ఆ అమాయకపు పిల్లను చూసి నేను నవ్వుకునేదానిని.

"ఈ పుస్తకంలో బొమ్మలు ఎంతో బాగున్నాయి," నేను చెప్పాను.

"దీనిని చూస్తే నువ్వు వేసే బొమ్మలు గుర్తు వస్తున్నాయి, యూన్."

ఆ పుస్తకం నాకు నచ్చింది కానీ తాడాట తాడు కావాలన్న కోరిక ఇంకా అలాగే ఉంది.

“ఇదిగో ఇది నీ రెండో బహుమతి,” అంటూ అందమైన పెట్టె ఇచ్చి అమ్మ నన్ను ఆశ్చర్య పరిచింది. ఆ పెట్టెలో ఎంతో విలువైన పచ్చతో చేసిన కంకణం ఉంది. లేత పచ్చ రంగులో మృదువుగా ఉన్న దానిని నేను చేతితో తడిమాను.

“ఇది పచ్చల కంకణం, యూన్,” అమ్మ చెప్పింది. “నా చిన్నప్పుడు దీనిని మా అమ్మ నాకు ఇచ్చింది. ఈ రోజు దీనిని నీకు ఇస్తున్నాను.” “ఇది నాకు చాలా నచ్చింది,” నేను చెప్పాను. అది నిజంగా చాలా బాగుండటంతో దానిని నా చేతిలోకి తీసుకోటానికి జంకాను.


“ఈ కంకణానికి లోపల వైపున కొరియా భాషలో నీ పేరు చెక్కి ఉంది,” అమ్మ చెప్పింది. ఆ అక్షరాలు నాట్యం చేస్తున్న తారల లాగా ఉన్నాయి. నా పేరుకి వెలిగే విజ్ఞత అని అర్థం.

తరవాత అమ్మ నాకు పచ్చల రాయి కథ చెప్పింది. “ఈ రాయి నేల పొరలలో దొరుకుతుంది, కానీ దీనిని స్వర్గలోకపు రత్నమని అంటారు. సంతోషానికి, ఆశకి ఈ పచ్చల రాయి సంకేతం. ఆ పచ్చ కంకణం వేసుకున్న అమ్మాయి అదృష్టవంతురాలు అవుతుంది. ఈ రాయి సత్యానికి, స్నేహానికి సంకేతం. అపురూపమైన అమ్మాయికి అపురూపమైన కానుక,” అంటూ యూన్ చేతికి అమ్మ ఆ కంకణాన్ని తొడిగింది.



మరునాడు బడిలో భోజన సమయంలో బల్లకి ఒక వైపున నేను కూర్చున్నాను. మరో తరగతి నుంచి ఒక పెద్దమ్మాయి వచ్చి నా పక్కన కూర్చుంది.

“నీ కంకణం చాలా బాగుంది!” ఆ అమ్మాయి మెచ్చుకుంది. దానికి నేను చాలా సంతోషించాను.



“నువ్వు ఒంటరిగా ఉన్నావు. నేను నీతో స్నేహం చేస్తాను. మనిద్దరం తాడాట ఆడుకుందామా?”

తాడాట? “ఆ, ఆ!” అంటూ నేను సంతోషంగా తలూపాను.

“సరే! నేను నీకు ఆ ఆట నేర్పిస్తాను. భలే మజా వస్తుంది.”

“అవును!” నా కొత్త స్నేహితురాలిని చూసి నవ్వాను.



అన్నం తినేసి మేం ఆడుకోటానికి బయటకు పరిగెత్తాం. ఆమె తాడు ఒక వైపున నాకు ఇచ్చి రెండో వైపుని కంచెకి కట్టింది. తాడుని ఎగరేస్తూ ఎలా తిప్పాలో నాకు చూపించి తాను దూకుతూ, పాడుతోంది. నేను వేగాన్ని పెంచుతూ, తగ్గిస్తూ తాడుని తిప్పుతున్నాను. తాడుని తిప్పటం నేను బాగా నేర్చుకున్నాను. కానీ గెంతటం నేర్చుకోవాలని కూడా నాకు ఉంది.

“గెంతటం ఎప్పుడు నేర్చుకుంటాను?” నేను అడిగాను.

“రేపు,” ఆ పెద్దమ్మాయి అంది. బెల్లు కొట్టారు. తరగతిలోకి వెళ్లే సమయం అయ్యింది. ఆ అమ్మాయి నా దగ్గర నుంచి తాడు తీసేసుకుంది.

“నీ కంకణం నాకు నిజంగా ఎంతో నచ్చింది,” ఆ అమ్మాయి చెప్పింది. “అమెరికాలో స్నేహితులు ఒకరి వస్తువులు ఒకరికి ఇచ్చుకుంటారు. మనం స్నేహితులం కావాలంటే నీ కంకణాన్ని నాకు ఇవ్వాలి. ఈ ఒక్క రోజుకి దీనిని నన్ను ఉంచుకోనివ్వు.”



"ఈ కంకణం నా పుట్టిన రోజు బహుమతి. దీనిని నీకివ్వలేను. మా అమ్మమ్మ దీనిని మా అమ్మకి ఇచ్చింది, మా అమ్మ దానిని నాకు ఇచ్చింది. నేనివ్వను," అంటూ తల అడ్డంగా ఊపాను.

"అయితే, మనం స్నేహితులం ఎలా అవుతాం?" పెద్ద అమ్మాయి అంది. "నీకు తాడు గెంతటం నేర్చుకోవాలని ఉందని అనుకున్నానే."

కంకణాన్ని తీసి నా చేతిలో పట్టుకున్నాను. ఇది పెట్టుకుంటే నేను అదృష్టవంతురాలిని అవుతానని, మంచి స్నేహితులు దొరుకుతారని అమ్మ చెప్పింది. అయితే దీనిని ఇతరులకు ఇవ్వటం నాకు నచ్చలేదు.

పెద్దమ్మాయి నా చేతిలోంచి కంకణాన్ని లాక్కుని తన చేతికి తొడిగేసుకుంది. "బాధపడవద్దు. దీనిని రేపు నీకు ఇచ్చేస్తాను," అని ఆ అమ్మాయి చెప్పింది.



బడి నుంచి ఇంటికి వచ్చిన తరవాత నేను తిన్నగా నా గదిలోకి వెళ్లాను. నా వెనకే మా అమ్మ వచ్చింది. నేను మంచం మీద కూర్చుని నా కొత్త కొరియన్ పుస్తకం చదువుతున్నాను. అమ్మ నా చెయ్యి పట్టుకోగానే కంగారు పడిపోయింది. "నీ కంకణం ఏది, యూన్?"

నేను అవమానంతో తల వంచుకున్నాను. నా నోటి వెంట మాట రాలేదు.

"నువ్వు విచారంగా ఉన్నావు. బడిలో దానిని పోగొట్టుకున్నావా, యూన్?"

ఏం చెప్పాలో నాకు తెలియ లేదు.

"చేతి నుంచి జారి, దొర్లిపోయి ఇక్కడే ఎక్కడో ఉండి ఉంటుంది," ఆమె కన్నీళ్ల పర్యంతం అయ్యింది. తరవాత వంగి మంచం కింద చూడసాగింది.

"అమ్మా, దానిని నేను బడిలో వదిలిపెట్టాను. రేపు తీసుకుని వస్తాను," అంటూ ఆమె చేతిని లాగాను.



మరునాడు బడి ప్రాంగణంలో ఆ పెద్దమ్మాయి కోసం ఎదురు చూస్తూ ఉన్నాను. ఆమె చేతికి నా పచ్చ కంకణం ఇంకా ఉంది. “నా కంకణం నాకు ఇచ్చెయ్యి,” అని అడిగాను. ఆమె అక్కడి నుంచి వేగంగా వెళ్లిపోతూ, “తరవాత ఇస్తాను,” అంది.

ఆ ఉదయమంతా విచారంతో నా మనసు భారంగా మారిపోయింది. ఆ కారణంగా చిన్న పదాల స్పెల్లింగ్ రాయలేకపోయాను, చిన్న చిన్న కూడికలు కూడా చెయ్య లేకపోయాను.

భోజనాలు చేసిన తరవాత పిల్లలందరూ మైదానంలోకి వెళ్లారు. ఆ అమ్మాయి కోసం నేను మళ్లీ వెదికాను. “నా కంకణం నీ దగ్గర ఉంది. అది నాకు కావాలి,” అన్నాను. “నన్ను విసిగించకు! నా వెంట పడకు,” అంటూ ఆమె నన్ను తోసేసి నవ్వసాగింది.

నా కథల పుస్తకంలోని మూర్ఖపు అమ్మాయి లాగా ఉంది నా పరిస్థితి. నన్ను ఒక పులి మోసం చేసింది.





తరగతి గదిలోకి తిరిగి వచ్చి బల్ల మీద ముఖం పెట్టి పడుకున్నాను.

"ఏమయ్యింది, యూన్?" మా టీచరు అడిగింది.

నేను ఆ పెద్ద అమ్మాయి గురించి చెప్పాను. ఆ అమ్మాయిని మా టీచరు మా తరగతికి పిలిపించింది.

"యూన్‌కి చెందిన ఏదైనా వస్తువు నీ దగ్గర ఉందా?" మా టీచరు ఆ అమ్మాయిని అడిగింది. "నీ చేతికి ఉన్న కంకణం యూన్‌దేనా?"


"లేదు, లేదు!" ఆ అమ్మాయి ఎంతో నమ్మకంగా చెప్పింది. "అది నాదే."

"కాదు! అది నా పుట్టిన రోజు బహుమతి!" నేను బదులిచ్చాను.

మా తరగతిలోని పిల్లలు మా చుట్టూ మూగారు.

"నిన్న యూన్ చేతికి దీనిని నేను చూశాను," పోనీటేల్ వేసుకున్న ఒక అమ్మాయి చెప్పింది.


"అవును, నేను కూడా చూశాను," ముఖాన మచ్చలున్న ఒక పిల్లవాడు చెప్పాడు.



"ఈ కంకణం గురించి ఏమైనా చెప్పగలవా, యూన్?" మా టీచరు అడిగింది.

"దీనిని మా అమ్మ నాకు ఇచ్చింది," ఆ పెద్ద అమ్మాయి కళ్లల్లోకి చూస్తూ నేను బదులిచ్చాను. "ఈ కంకణం ధైర్యం, సాహసాలకు ప్రతీక. ఇది నిజమైన స్నేహానికి కూడా ప్రతీక."

"ఈ కంకణం గురించి ఇప్పుడు నువ్వు చెప్పు," పెద్ద అమ్మాయిని టీచరు అడిగింది.



“అది... మృదువుగా ఉంటుంది, పచ్చగా ఉంటుంది,” కచ్చితమైన స్వరంలో ఆ అమ్మాయి చెప్పింది.

నా కంకణం నాకు తిరిగి దక్కదేమోనని నాకు బాధ కలిగింది. నేను వెలిగే విజ్ఞతను కాదు అనుకున్నాను. నా పేరు వెలిగే మూర్ఖత్వం అని అమ్మ పెట్టి ఉండాల్సింది.

అప్పుడు నాకు ఒక ఆలోచన వచ్చింది. మా టీచరు చెవిలో మెల్లిగా అది చెప్పాను.

“అయితే ఈ కంకణం లోపలివైపు సంగతి చెప్పు,” టీచరు పెద్ద అమ్మాయిని అడిగింది.


“అది... మృదువుగా ఉంటుంది, పచ్చగా ఉంటుంది,” అవే మాటలను పెద్ద అమ్మాయి తిరిగి చెప్పింది. ఆ కంకణాన్ని తియ్యమని పెద్ద అమ్మాయికి టీచరు చెప్పింది. అందుకు ఆమె చాలా కష్టపడాల్సి వచ్చింది. కంకణం లోపలి వైపు నాట్యం చేస్తున్న తారల లాగా ఉన్న అక్షరాలను టీచరు చూసింది.

“వీటి అర్థం ఏమిటో నీకు తెలుసా?” ఆ పెద్ద అమ్మాయిని టీచరు అడిగింది.

“తెలియదు,” పెద్ద అమ్మాయి బదులిచ్చింది. “ఇలాంటి కంకణమే నాకు ఉండేది... అందుకే ఇది నాదని అనుకున్నాను. కానీ ఇది యూన్‌దేనేమో.”

సమస్యని కొని తెచ్చుకున్నావు అన్నట్టు పెద్ద అమ్మాయిని మా టీచరు చూసింది.

తరవాత ఆ కంకణాన్ని ఆమె నా చేతికి తొడిగింది. “నీ పేరు ఉన్న కంకణం ఇదిగో, వెలిగే విజ్ఞతా.” అది నా చేతికి తేలికగా పట్టింది.





బడి నుంచి తిరిగి వచ్చిన నా చేతికి అమ్మ పచ్చ కంకణాన్ని చూసింది. “అయితే ఇది బడిలోనే ఉందన్నమాట!”

“పచ్చ కంకణం వేసుకుంటే వాళ్ల కోరికలు తీరతాయా, అమ్మా?” నేను అడిగాను. “అలా అని అందరూ నమ్ముతారు,” అంటూ అమ్మ నవ్వింది. “నీ కోరిక ఏమిటి?”

తాడాట తాడు, నిజమైన స్నేహం అన్న నా కోరికలను అమ్మకి చెప్పాను.



ఒక పులిని టోకరా కొట్టించిన ఒక తెలిపైన అమ్మాయి కథ ఆమెకి చెప్పాను.



**అయిపోయింది**